# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 122 వ భాగం

## పురంజనోపాఖ్యానం 15

క్రితం నెల వ్యాసంలో పురంజనుడి గురించి చూసాం. అనేకచోట్ల తిరిగాక ఆయనకో పురం దొరికింది; అందులో కనిపించిన ఒకావిడని చూసి వివరాలు అడిగాడు. దానికి ఈవిడ సమాధానం చెప్తోంది. ఈ సమాధానం చదివేముందు కొంచెం ఆలోచిద్దాం. ఈ పురంజనుడు మగవాడు అందువల్ల ఆయనకి ఒక ప్రమదోత్తమ కనిపించింది అందువల్ల భాగవతం లో అంతా మగవారికే, ఇది ఆడవారు చదవకూడదు, లేదా లింగ వివక్షతో రాసారు అనుకోకూడదు. ఇంతకు ముందు ఒకసారి చెప్పినట్టూ, హిందూమతంలో చెప్పే విషయాలు ఆడా, మగా అనే తేడా లేకుండా మనుషులందరికీ సంబంధించినవి. ఇది అందరికీ వర్తిస్తుంది. ఇప్పటివరకూ చెప్పుకున్న కథలో పురంజని అనే ఆవిడ ఉంటే ఆవిడకి ప్రమదోత్తముడు దొరికి/కనబడి ఉండొచ్చు అని కథ తిరగరాయకుండా అర్థం చేసుకోవచ్చు. ఈ విషయాలన్నీ పురంజనోపాఖ్యానం చివర్న అర్థమౌతాయి. అప్పటివరకూ ఓపిక పట్టండి. ఈవిడ సమాధానం చూద్దాం ఇప్పుడు.

వ. అని యివ్విధంబున నధీరుండై పలుకు పురంజనుం జూచి యా ప్రమదోత్తమ వీరమోహితయై సస్మితానన యగుచు నానందంబునొంది యిట్లనియె. [4-756]

క. పురుషవర! నాకు నీకును
గురువును నామమును గులముఁ గోరి యెఱుఁగ నీ
పురమున నుండుదుఁగా; కీ
పురమును నిర్మించి నట్టి పురుషు నెఱుంగన్! [4-757]

ఆవిడ ఆనందం పొంది మోహంతో ఇలా అంది. పురుష శ్రేష్టుడా, నీకూ నాకూ గురువు, కులం అవన్నీ నాకు తెలియవు. నేను ఈ పురంలో ఉండేది నిజమే కానీ ఈ పురం ఎవరు నిర్మించారో, ఎందుకో అనే విషయాలు నాకు ఈ మాత్రం తెలియవు. ఇక పోతే ఈ భృత్యుల సంగతి.

క. వీరలు నా సఖు లీ లల
నారత్నము లార్యవినుత !నా చెలు; లీ వృ
ద్ధోరగ మే నిద్రింపఁగ
ధీరత మేల్కాంచి పురము ధృతిఁ బాలించున్. [4-758]

వీళ్ళందరూ(లలనా రత్నములు) నా స్నేహితులు, నా చెలికత్తెలు. ఈ ముసలి సర్పం (వృద్ధోరగము – వృద్ధమైన ఉరగము – సర్పము) మేము పడుకున్నప్పుడూ, మెలుకువగా ఉన్నప్పుడూ పురాన్ని రక్షిస్తూ ఉంటుంది. ఎలా రక్షిస్తూ ఉంటుందనేది కూడా చెప్తున్నారు – ధీరత మేల్కాంచి – ధీ శక్తితో.

సీ. మనుజ నాయక; నీవు మద్భాగ్య వశమున
నిటకు నేతెంచితి; విపుడు నీకు
మంగళంబగు; నీవు మహితేంద్రియగ్రామ
భోగ్యంబులగు కామపుంజములను
నర్థి సంపాదింతు; వనఘాత్మ; యీ నవ
ద్వార ప్రయుక్త మై తనరు పురము
నీవు గైకొని యేలు; నీ కంటె దీనికి
నధిపుఁ డన్యుండు లేఁ డనఘ; యిందు [4-760]

తే. మదుపనీతములైన కామముల ననుభ
వింపఁగా సమాశత మధిష్టింపు మెలమిఁ;
గోరి నీకంటెఁ బ్రియులు నెవ్వారు నాకు?
నరసి చూడంగ మనుజేంద్ర; యదియుఁ గాక. [4-760.1]

నా అదృష్టం కొద్దీ నువ్వు ఇక్కడకి వచ్చావు. నువ్వు ఇంద్రియాలు ఇచ్చే అన్ని గొప్ప సుఖాలూ అనుభవించగలవు ఇక్కడ (మహితేంద్రియ – మహత్=గొప్ప).ఈ పురాన్ని తీసుకుని పరిపాలించు (నీవు గైకొని యేలు). దీన్ని పాలించడానికి నీకంటే గొప్పవాడు మరొకడు లేడు. దీన్ని నూరేండ్లు అనుభవించవచ్చు (సమాశత మధిష్టింపు). ఎంత వెతికినా నీ కంటే ప్రియమైనవారు నాకు ఇంకెవరున్నారు?

క. కరుణారస పరిపూర్ణ
స్ఫురితస్మిత రుచి విలోక పుంజముచేతం
గర మర్థి దీన జన భయ
హరణుఁడవై సంచరింపు మఖిల జగములన్. [4-762]

కరుణా రసంతో చిరునవ్వులు చిందే చూపులతో దీన జనులకి అభయం ఇస్తూ అన్నిలోకాల్లోనూ విహరించు. చూపులు అనే పదం ఈ పద్యంలో ఎక్కడుంది? విలోక పుంజము – చక్కటి చూపుల సమూహము. ఈ పద్యాలు రసగుళికలో రాస్తున్నప్పుడూ మరోసారి చదువుతున్నప్పుడూ అసలు నాకు తెలుగు వచ్చా అనే ప్రశ్న అనేకమార్లు నాకు నేనే వేసుకుంటున్నాను ప్రతీసారీ.

క. అని యీ గతిఁ బలికిన యా
వనజాక్షిఁ బురంజనుండు వరియించి ముదం
బున నన్యోన్యప్రీతిం
దనరుచుఁ దత్పురము చొచ్చి ధన్యుం డగుచున్ [4-763]

ఇలా అనగానే ఆవిడని పురంజనుడు వరించాడు. తర్వాత ఆ పురంలో ఇద్దరికీ ప్రీతి కలిగేలాగ చరించడం, లేదా జీవించడం మొదలుపెట్టాడు.

చ. శతసమకాల మప్పురి నజస్రము భూరిసమస్త సౌఖ్య సం

గతులఁ దనర్చి వందిజన గాయక సద్వినుతోరు గాన మో
దిత మతి నొప్పి సుందరసతీ జనసేవితుఁడై నృపాల కో
చిత లలితస్థలంబుల వసించుచుఁ గ్రీడలు సల్పుచుండఁగన్. [4-764]

ఈ పురంలో సమస్త సౌఖ్యాలూ (భూరి – గొప్పవైన), వందిమాగతులు అంటే చేసే పని ప్రతీదానికీ మంచిదా చెడుదా అనే వివక్ష లేకుండా మెచ్చుకునే తందాన తాన జనం, పాటలు అవీ పాడుతుండగా (వందిజన గాయ క సదివినుతోరు గాన), సేవకులతో సేవించబడుతూ (ముందు చెప్పుకున్న పదిమంది అనుచరులూ, వారికూడా ఉండే మరో వందమంది సేవకులూ) – వంద సంవత్సరాలు (శత సమకాలం) గడిపాడు.

సీ. అవనీశ్వరోత్తమ! యప్పురంబున నాల్గు
వంకలనున్న గవఁకులు వినుము
తూర్పు దిక్కునకు నైదును దక్షిణోత్తరం
బుల రెండుఁ బశ్చిమంబు నను రెండు
గాఁగ నా తొమ్మిది గవఁకుల నుపరి ది
క్కున నేఁడు గ్రింది దిక్కునను రెండు
నయి యుండు; మఱి వాని యందుఁ పృథగ్విధ
విషయ గత్యర్థమై వెలయు నీశ్వ [4-767]

తే. రుం డొకం డరయఁ గలండు రూఢిఁ దత్పు
రంబుఁ బాలించునట్టి పురంజనుండు
నా పురద్వార నవకంబు; నందులోన
నర్థిఁ బ్రాగ్ద్వార పంచకమందు వరుస. [4-767.1]

కథ ఇంతవరకూ చెప్పాక ఇప్పుడు నారదుడు ఈ పురం గురించి వివరాలు చెప్తున్నాడు – ఈ పురానికి నాలుగు వంకలలో ఉన్న ద్వారాల (గవకులు) గురించి విను. తూర్పు ముఖంగా ఐదు ద్వారాలున్నాయి పురానికి. దక్షిణంగా రెండూ, పశ్చిమంగా మరో రెండూ ద్వారాలున్నాయి. ఈ తొమ్మిది ద్వారాల్లో పైన ఉన్నవి ఏడు; కింద ఉన్నవి రెండు.

విషయేంద్రియాలవల్ల సుఖం గ్రహించడానికి ఓ ప్రభువు ఉన్నాడు. ఈ పురాన్ని పరిపాలించేవాడే పురంజనుడు. ఇంత చెప్పాక ఈ ద్వారాలు ఎలా, ఎక్కడ ఉంటాయో చెప్తున్నాడు.

వ. ఖద్యోతయు హవిర్ముఖియు నను నామంబులుగల ద్వారయుగంబున ద్యుమత్సఖుఁడై విభ్రాజితాఖ్య జనపదంబును బొందు; వెండియు నళినియు నాళినియు నను పేళ్ళు గల వాకిళ్లు రెంటి యందు నవధూత సఖుండై సౌరభరూపంబు లయిన విషయంబులం బొందు; మఱియు ముఖ్యానామకం బైన ప్రధాన ప్రాగ్ద్వారంబున రసజ్ఞ విపణాన్వితుండై యాపణబహూదనంబులను విషయంబులనొందు; బితృహూ నామకం బయిన దక్షిణ ద్వారంబున శ్రుతధరాన్వితుం డై దక్షిణ పాంచాలంబను రాష్ట్రంబు నొందు; దేవహూ నామకంబయిన యుత్తరపు వాకిట శ్రుతధరాన్వితుండై యుత్తర పాంచాలంబను రాష్ట్రంబు నొందు; వెండియుం బడమటి వాకిళ్ళు రెంటియందు నాసురీ నామకం బైన వాకిట దుర్మదసమేతుండై గ్రామక నామకంబైన విషయంబును, నిరృతి నామకం బయిన వాకిటయందు లుబ్ధక యుక్తుండై వైశసం బను విషయంబు నొందుచుండు; వెండియుం బురంజనుం డప్పురంబునం బౌరజనంబులందు నిర్వాక్పేశస్కరులను నిద్దఱంధులు గలరు; వారలచేత గమన కరణంబులను క్రియల నొందుచు నంతఃపురగతుం డగు నప్పుడు విషూచీ సమన్వితుండై జాయాత్మజోద్భవంబు లైన మోహ ప్రసాద హర్షంబుల నొందుచుండు; నివ్విధంబునం గర్మాసక్తుండుఁ గామాసక్తుండునై బుద్ధియను మహిషిచేత వంచితుం డయ్యె; నక్కామినియు. [4-768]

ఖద్యోతం, హవిర్ముఖి అనే ద్వారాలు ఒకచోట ఉంటాయి. వీటి ద్వారా ద్యుమంతుడు అనే సఖుడితో విభ్రాజితం అనే జనపదాలకి వెళ్తూంటాడు ఈ పురంజనుడు. నళిని, నాళిని అనే ద్వారాల గుండా, అవధూత అనే స్నేహితుడితో సౌరభం అనే విషయాలు గ్రహిస్తాడు. ముఖ్య ద్వారం అనబడే ప్రధాన ద్వారం గుండా రసజ్ఞుడు అనే మిత్రులతో కొన్ని విషయాలకి పోతూ ఉంటాడు. దక్షిణ ద్వారం పేరు పిత్రూహుకం; దాని ద్వారా వెళ్ళేది దక్షిణ పాంచాలం. అలాగే ఉత్తర ద్వారం గుండా ఉత్తర పాంచాలకం పోతూ ఉంటాడు. పడమటి ద్వారాలతో గ్రామక విషయం, వైశసం అనే విషయం తెలుసుకుంటూ ఉంటాడు. ఈ పురంలో నిర్వాకుడు పేశస్కరుడు అనే ఇద్దరు గుడ్డి వారున్నారు. వీళ్ల సహాయంతో గమనం కరణం అనే పనులు నెరవేరుస్తూంటాడు. ఈ పురంలో ప్రమదోత్తమ (విషూచి) తో కల్సి మోహం, ప్రసాదం హర్షం అనేవాటివి పొందుతూ ఉంటాడు – భార్యా పిల్లలతో కలిసి. ఇలా బుద్ధి అనే మహిషి చేత మోసగించబడ్డాడు. వీటి అన్నింటికీ కారణం ఏమంటే, కామాసక్తత (కోరికలు), కర్మాసక్తత (పనిచేయడం మీద ఆసక్తి). ఈ పురంజనుడి భార్య (నక్కామియు) ఎలా ఉండేదో చెప్తున్నాడిప్పుడు.

సీ. పానంబు చేసినఁ దానుఁ బానము చేయుఁ-
గుడిచినఁ దాను గుడుచు; మఱియు
భక్షింపఁ దాను భక్షించు; నడచిన-
నడచును; నవ్విన నవ్వు; నేడ్వ
నేడుచుఁ; బాడినఁ బాడు; విన్నను వినుఁ-
జూచినఁ జూచుఁ; గూర్చున్న నుండు;
దుఃఖింప దీనుఁడై దుఃఖించు; నిలిచిన
నిలుచు; నిద్రింపఁగ నిద్రబోవు; [4-769]

తే. ముట్టినను ముట్టు; మూర్కొన్న మూరు కొనును;
బలుకఁ బలుకును; బవళింపఁ బవ్వళించు;
హర్షమును బొంద నాత్మను హర్ష మొందు;
మోదమును బొందఁ దాను మోద మందు. [4-769.1]

పురంజనుడి రాణి, రాజు తాగితే ఆవిడ కూడా తాగుతుంది, తింటే తింటుంది. నడిస్తే నడవడం, ఏడుస్తే ఏడవడం , నవ్వితే నవ్వడం, మాట్లాడితే మాట్లాడ్డం, సంతోషిస్తే సంతోషించడం. అన్నీ రాజు ఎలా చేస్తే ఈవిడ కూడా అలాగే చేస్తుంది.

విషయం గమనిస్తే, ఈ పురంజనుడు ఇలా నవద్వారాలతో ఉండే పురం లో వంద సంవత్సరాలు బతికాడు. ఏం చేసి బతికాడు? కామాసక్తతో కర్మాసక్తతో, విషయ వాంఛలు అనుక్షణం అనుభవిస్తూ. ఈ వాంఛలతో సుఖం వస్తే సుఖం, కష్టం వస్తే కష్టం భరించాడు. తప్పదు కనక వాళ్ళావిడ కూడా ఇదే చేసింది. ఇప్పటికి ఈ పురం అంటే ద్వారాలంటే చూచాయగా అర్థం అయింది కదా? తర్వాత ఏం జరుగుతుందో వచ్చే వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS